సాక్షి నంద్యాల

శుక్రవారం, 9, ఆగస్టు, 2024



టీడీపీ దౌర్జన్యకాండ
స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో టీడీపీ నాయకులు దౌర్జన్యం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడులకు దిగారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. 8లో▸



అన్నదాన పథకానికి విరాళం
శ్రీశైలం: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ1,00,116లను శ్రీకాకుళానికి చెందిన రజనీష్ దొర తన కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632.45
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:103.780
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:57,819
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:59,839

న్యూస్‌రీల్

మహానందిలో జిల్లా న్యాయమూర్తి



జిల్లా జడ్జి కపర్దిని ఆశీర్వదిస్తున్న దృశ్యం

మహానంది: కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కపర్ది గురువారం మహానందికి వచ్చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఏఈఓ ఎర్రమల మధు, వేదపండితుడు రవిశంకర అవధాని, అర్చకులు స్వాగతం పలికారు. జిల్లా జడ్జి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆయనకు స్వామి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలం: నాగులచవితి కావడంతో గురువారం శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర దర్శనం క్యూలు కిక్కిరిసి కనిపించాయి. ఆన్‌లైన్ టికెట్ పొందిన భక్తులకు ఉదయం 7.30, మధ్యాహ్నం 12.30, సాయంత్రం 6.30 గంటలకు విడతల వారీగా స్పర్శదర్శనం కల్పించారు. సామాన్య భక్తులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రాత్రి 9 నుంచి 10 గంటల వరకు స్పర్శదర్శనానికి అనుమతించారు. రద్దీ అధికంగా ఉండడంతో ఏర్పాట్లను ఈఓ పెద్దిరాజు పర్యవేక్షించారు.

అవుకు రిజర్వాయర్‌కు నీటి విడుదల



పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు నగరి కాలువ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు 11వేల క్యూసెక్కుల నీటిని అధికారులు వదులుతున్నారు. ప్రస్తుతం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 11వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1,400 క్యూసెక్కులు ఎస్సార్బీసీకి, మిగిలిన నీటిని గోరుకల్లులోకి పంపిస్తున్నారు. గురువారం నాటిని గోరుకల్లు జలాశయంలో 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని అవుకు జలాశయంలోకి పంపి, అటు నుంచి గండికోటకు నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డీఎస్పీలకు స్థానచలనం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముగ్గురు డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా 28 మంది డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

- పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎన్.యుగంధర్ బాబును నంద్యాల ఎస్‌డీపీఓగా నియమించారు.
- ఆదోని డీఎస్పీ జె.శివనారాయణస్వామిని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేసి సీఐడీ విభాగంలో పనిచేస్తున్న డి.సోమన్నను ఆదోనికి నియమించారు.
- పత్తికొండ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డిని కూడా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు వెలువడ్డాయి.
- పత్తికొండ, కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్, కర్నూలు దిశ పీఎస్‌లకు డీఎస్పీలను నియమించాల్సి ఉంది.

మరో 20 మంది ఎస్ఐల బదిలీ

కర్నూలు: పోలీసు శాఖలో బదిలీల పర్వం కొనసాగుతోంది. విడతల వారీగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం రేంజ్ పరిధిలో 20 మంది ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు.



ఆదోని మండలం నాగనాథనహళ్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుండమ్మను టీడీపీ నేత రాఘవేంద్రరెడ్డి ట్రాక్టర్‌తో ఢీకొట్టి పొలంలో హత్య చేశారు. పొలం విషయంలో ఇద్దరికీ కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి రావడంతో రాఘవేంద్రరెడ్డి బరి తెగించి హత్య చేశారు.

టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 12 హత్యలు జరిగాయి. ఇందులో కొన్ని రాజకీయ హత్యలైతే, తక్కినవి ఇతర కారణాలతో చోటు చేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, వైఎస్సార్ విగ్రహాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలు లెక్కలేనన్ని జరిగాయి. దీన్నిబట్టే శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో స్పష్టమవుతోంది.





శ్రీశైలం నియోజకవర్గం సీతారామాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపులేటి సుబ్బరాయుడును టీడీపీ నేతలు అతి కిరాతకంగా రాళ్లు, రాడ్లు, కత్తులతో దాడి చేసి చంపారు. గ్రామంలో హత్య జరుగుతుందని పోలీసులకు సమాచారం ఇచ్చినా, పోలీసులు హత్యకు ముందు మూడు గంటల పాటు గ్రామంలో ఉన్నా, వారి ఎదుటే హత్య జరుగుతున్నా నివారించలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రాజకీయ హత్య కాదు.. కాదు.. సర్కారు హత్య తీవ్ర కలకలం రేపింది.



1. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న లక్ష్మీనాయుడు (జూన్21)

2. టీడీపీ నాయకులు చేతులో గాయపడిన ఒందుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డి

3. కోడుమూరు మండలంలోని కొత్తపల్లెలో టీడీపీ కార్యకర్తల దాడి గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త దయ్యాల కేశవులు

4. బొమ్మిరెడ్డిపల్లెలో జూన్ 4 ఎన్నికల ఫలితాల నాడు టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ లోకరాజు



తుగ్గలి మండలం, దిగువ చింతల కొండలో జూన్ 15న టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులు

‘రెడ్’ బుక్.. నెత్తుటి సిరాతో!

‘ఎరుపెక్కిన’ పాలన

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 12 హత్యలు
- వీటిలో కొన్నింటి వెనుక రాజకీయ కక్షలు
- 50కు పైగా దాడి ఘటనలు
- టీడీపీ శ్రేణుల తీరుతో ఫ్యాక్షన్ భయం
- పూర్తిగా గాడితప్పిన శాంతిభద్రతలు
- నేడు సీతారామాపురానికి మాజీ సీఎం వైఎస్ జగన్
- దారుణహత్యకు గురైన సుబ్బరాయుడు కుటుంబానికి పరామర్శ

మొన్నటి వరకు ఎవరి నోట విన్నా ‘సంక్షేమమే’. క్యాలెండర్ వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ. కుల.. మత.. వర్గ.. పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు పథకాల వర్తింపు. ఎన్నికల వేళ అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టిన టీడీపీ ‘సంక్షేమానికి’ మంగళం పాడింది. హామీలను పక్కనపెట్టి.. మాటలతో మాయ చేస్తోంది. పోలీసుల చేతికి సంకెళ్లు వేయడంతో.. కత్తులు ఎగిరెగిరి పడుతున్నాయి. కుత్తుకలు తెగిపడుతుంటే.. ఊరూవాడా నెత్తురు పారుతోంది. రాజకీయ కక్షలకు ఇళ్లూ వాకిలి గుల్ల అవుతోంది. నాయకుల మౌనం ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తోంది.

నేడు సీతారామాపురానికి వైఎస్ జగన్



సీతారామాపురానికి శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. విజయవాడ నుంచి ఓర్వకల్లుకు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన సీతారామాపురం చేరుకుంటారు. హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఆపై తిరిగి ఓర్వకల్లుకు చేరుకుని తిరుగుపయనం అవుతారు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: శ్రీశైలం నియోజకవర్గం సీతారామాపురంలో జరిగిన హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ప్రత్యర్థులు హత్య చేసేందుకు సిద్ధమవుతున్నారు? మూకను గుంపు చేస్తున్నారని తెలిపినా.. ఎస్ఐ, కానిస్టేబుళ్లు వచ్చిన తర్వాత వారి ముందే అరాచకం సృష్టిస్తున్నా పట్టించుకోని పరిస్థితి. ఘటన తీవ్రత గురించి చెప్పి, బందోబస్తును పంపాలని సీఐ, డీఎస్పీని కోరేందుకు ప్రయత్నిస్తే వారు స్పందించలేదని ఎస్ఐ చెప్పడం, అంతపెద్ద ఘటనకు కనీసం రివాల్వర్ లేకుండా ఎస్ఐ వెళ్లడం చూస్తే విధి నిర్వహణలో పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఇట్టే తెలుస్తోంది.

ప్రతీ పల్లెలో భయోత్పాతం

కర్నూలు జిల్లాలో 20 ఏళ్ల కిందట ఫ్యాక్షన్ హత్యలు జరిగాయి. ప్రభుత్వాలు మారినప్పుడు ఎప్పుడూ దాడులు చేసుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల వరకే రాజకీయం, ఆ తర్వాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యేవారు. ఈ దఫా మాత్రం టీడీపీ ప్రభుత్వం కొలువుదీరగానే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కక్షపూరితంగా విపక్షపార్టీ నేతలు, కార్యకర్తలపై విరుచుకుపడుతున్నారు. దీంతోనే హత్యలు, దాడులు జరుగుతున్నాయి. పత్తికొండ నియోజకవర్గంలో 80 కుటుంబాలు టీడీపీ నేతలకు భయపడి ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు వదిలిపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. వీరు ఊళ్లు దాటడంతో వారికి చెందిన భూములు సాగు చేయక బీడుగా ఉన్నాయి. పిల్లలను చదివించుకునేందుకు సొంత ఊళ్లలోని స్కూళ్లలో టీసీలు తీసుకుని మరో ప్రాంతానికి వలసవెళ్లి పడరానిపాట్లు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు.

మళ్లీ ఫ్యాక్షన్‌కు బీజం పడుతోందా?

కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలో మూడు దశాబ్దాల కిందట ఫ్యాక్షన్ తీవ్రంగా నడిచేది. 2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ‘ఫ్యాక్షన్’ జోలికి ఎవ్వరూ వెళ్లకూడదని సీమ నేతలను కట్టడి చేశారు. ‘సీమ’ అభివృద్ధి కాంక్షించారు. ‘హంద్రీ-నీవా’, గాలేరు-నగరితో పాటు సీమకు సాగునీటి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పిల్లలను పెద్దచదువులు చదివించేందుకు ఉపక్రమించారు. అంతా సంతోషంగా పంటలు పండించుకుని, పిల్లలను ఉన్నత చదువులు చదివించడంపై దృష్టి పెట్టారు. ‘ఫ్యాక్షన్ ’ను పూర్తిగా పక్కనపెట్టారు. దీంతో పల్లెలన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. గతంలో ‘ఫ్యాక్షన్ ’ వల్ల గాయపడిన కుటుంబాలు కూడా రాజీ అయ్యాయి. ఈ క్రమంలో ఇప్పుడు తిరిగి ‘ఫ్యాక్షన్ ’ చెలరేగే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అధికారం ఉందని టీడీపీ నేతలు దారుణంగా హత్యలకు పాల్పడుతున్నారు. దాడులకు దిగుతున్నారు. దెబ్బతిన్న కుటుంబాల్లో తిరగబడి కక్ష తీర్చుకోవాలనే ఆలోచనకు బీజం పడితే ఏళ్లు గడిచినా పగ కోసం వెంటపడతారు. ఇది పల్లెలకు మంచిది కాదు. ఒక కుటుంబంపై మరో కుటుంబం కక్ష తీర్చుకునే క్రమంలో ఎన్నో కుటుంబాలు వీధినపడే అవకాశం ఉంది. వారి పిల్లల భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముంది. టీడీపీ 50రోజుల పాలనలో కనీసం 50కిపైగా ఘటనలు జరిగాయి. ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ చర్యలను ఖండించడం లేదు. టీడీపీ వర్గీయులను వారించడం లేదు. పైగా బుడ్డా రాజశేఖరరెడ్డి లాంటి వారు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. ఇవన్నీ చూస్తే పథకం ప్రకారమే విపక్షాలపై దాడులు చేయాలని టీడీపీ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ పరిణామం ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాట పడుతున్న పల్లెలకు మంచిది కాదనే చర్చ జరుగుతోంది.

ఇటీవల జరిగిన ముఖ్య ఘటనలు కొన్ని

- జూలై 2: గడివేముల మండలం ఒండుట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి హత్యాయత్నం.
- జూన్ 8: అల్లుగుండలో పెద్దమద్దన్న, మనోహర్, మోహనకృష్ణ, చిన్న మారెన్నతో పాటు వీర్వో ప్రసాద్‌పై దాడి.
- జూన్ 15: కృష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో సురేశ్ బైక్‌ను నిప్పంటించి, అతన్ని చంపేందుకు యత్నం. సురేశ్ కుటుంబం ఊరు వదిలి వెళ్లిపోయింది.
- జూన్ 8: కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో హరికృష్ణ అనే కార్యకర్తపై దాడి.
- జూన్ 14: కల్వటాలలో శ్రీకాంత్‌రెడ్డి ఏజెంటుగా కూర్చున్నారని దాడి.
- జూన్ 21: అబ్దులాపురంలో బోయ లక్ష్మినా యుడిని ఇంట్లో నుంచి వీధిలోకి ఈడ్చుకొచ్చి దాడి.
- హుస్సేనాపురంలో పోలింగ్ రోజున వైఎస్సార్‌సీపీ ఏజెంటు వెంగన్నపై అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అనుచరులు తల, ఛాతీపై దాడి చేసి గాయపరిచారు.
- టీడీపీ నేతలకు భయపడి బొమ్మిరెడ్డిపల్లెలో నరేశ్, వెల్దుర్తి మండలంలో ఆరిఫ్, హఫీజ్‌తో పాటు చాలా కుటుంబాలు ఊరు వదిలి వెళ్లిపోయాయి.
- కోడుమూరు మండలం కొత్తపల్లిలో కేశవులు, చిన్నమద్దిలపై దాడి చేశారు.
- కొలిమిగుండ్లలో వడ్డె శీనును కట్టెలతో దారుణంగా చితకబాది గాయపరిచారు.
- జూన్ 13: ఆత్మకూరులో వైఎస్ఆర్‌సీపీ నాయకులు భాస్కర్‌పై టీడీపీ కార్యకర్తల దాడి.

‘ఖద్దరు’ చేతిలో బందీగా ‘ఖాకీ’



ఈ స్థాయిలో దాడులు జరగడానికి మరో ప్రధాన కారణం పోలీసు వైఫల్యం. హత్య, దాడి చేస్తే పోలీసుల నుంచి ముప్పు ఉంటుందనే భయం టీడీపీ శ్రేణుల్లో లేదు. అందుకే ధైర్యంగా దాడులకు తెగిస్తున్నారు. పోలీసులు శాంతిభద్రతల కంటే, వారి పోస్టింగ్ కోసం ఆరాటపడుతున్నారు. దీంతో టీడీపీ నేతలకు పూర్తి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో ఎక్కడ గట్టిగా ఉంటే పోస్టింగ్ దక్కదనే భయం అందరిలోనూ ఉంది. దీంతో దాడులను నిలువరించలేకపోతున్నారు.





కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో టీడీపీ నాయకుల దాడిలో జూన్ 8న గాయపడిన హరికృష్ణ, తిరుపతమ్మ



టీడీపీ నేతల దాడిలో వెల్దుర్తిలో జూలై 24న గాయపడిన రెహమాన్



ఇటీవల టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన ఆస్పరి సీఐ హనుమంతప్ప



బొమ్మిరెడ్డిపల్లెలో జూలై 29న టీడీపీ కార్యకర్త నిప్పంటించడంతో దగ్ధమైన రెండు బైక్‌లు

అరాచకాలు ఆపి.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- డోన్ ఎమ్మెల్యే కోట్లకు మాజీ మంత్రి బుగ్గన హితవు

ప్యాపిలి: టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ఆపి అభివృద్ధిపై డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి దృష్టి పెట్టాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హితవు పలికారు. మండల పరిధిలోని పోదొడ్డి గ్రామంలో గత నెల 13 వ తేదీ టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, రామరంగడు, శేషు, ఆదినారాయణను గురువారం మాజీ మంత్రి పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల పాటు డోన్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉండేదన్నారు. టీడీపీ డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట్ల పేరు ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంస్కృతి మరీ శ్రుతి మించిందన్నారు. టీడీపీ నాయకులు ఇటీవల డోన్‌లో ఓ భూవివాదం విషయంలో ఆర్యవైశ్యుల ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారని, దాడులతో సామాన్య ప్రజలను ఎంతకాలం భయపెడతారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులన్నీ 99 శాతం పూర్తయ్యాయని.. మిగిలిన ఒక్క శాతాన్ని కూడా ఎమ్మెల్యే కోట్ల పూర్తి చేయలేకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి ఎమ్మెల్యేను కలవాలని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. ప్యాపిలిలో రూ.50 కోట్లతో మంజూరైన టర్మినల్ మార్కెట్ టీడీపీ నాయకుల నిర్లక్ష్యంతో రద్దు కావడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో వివిధ పనులను ఎందుకు ఆపివేశారో సమాధానం చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

క్రషర్ ఫ్యాక్టరీ మీకు అప్పగించాలా.. ఇదెక్కడి సంస్కృతి?

పోదొడ్డి గ్రామ శివారు ప్రాంతంలో తమ బంధువు అన్ని అనుమతులు తీసుకుని క్రషర్ ఫ్యాక్టరీ నడుపుకుంటున్నట్లు బుగ్గన తెలిపారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ క్రషర్‌ను తనకు అప్పగించాలంటూ ఎమ్మెల్యే కోట్ల మధ్యవర్తి ద్వారా చెప్పి పంపాడన్నారు. ఇదెక్కడి సంస్కృతో తనకు అర్థం కాలేదన్నారు. అనుమతులు తెచ్చుకుని నడుపుకుంటే ఎవరైనా వద్దంటారా అని ప్రశ్నించారు. క్రషర్ ఫ్యాక్టరీ విషయంలో వేటకొడవళ్లతో దాడులు చేసి తమ పార్టీ నాయకులను, కార్యర్తలను గాయపర్చారని తెలిపారు. ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నడపకూడదని హెచ్చరించడం టీడీపీ నాయకులకే చెల్లిందన్నారు. అధికారంలో ఎవరుంటే వారికి ఫ్యాక్టరీలు, తోటలు ఇచ్చేయాలనే నీచ సంస్కృతికి టీడీపీ నాయకులు పాల్పడుతున్నారన్నారు.

నలుగురు ఎమ్మెల్యేల పాలన

నియోజకవర్గంలో నలుగురు ఎమ్మెల్యేల వింత పాలన సాగుతోందని బుగ్గన ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కూడా ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారని, అధికారులకు ఉదయం 5 గంటలకే ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, కృష్ణమూర్తి, రంగనాయకులు, ఓబులరెడ్డి, సూర్యుడు, వెంకటరాముడు, నారాయణస్వామి, అమర్నాథ్, రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, శ్యాంరెడ్డి, బోరెడ్డి రాము, కృష్ణారెడ్డి, రజనీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ క్వారీపై విజిలెన్స్ దాడులు

కర్నూలు (టౌన్): అక్రమ క్వారీపై గనుల శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామంలో సర్వే నంబర్ 285, 286, 288లో, అలాగే పెద్దమల్కాపురం సర్వే నంబర్ 100లో అనుమతులు లేకుండా క్వారీ పనులు చేస్తున్నారు. అక్రమంగా డోలమైట్, మొజాయిక్స్ తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం విజిలెన్స్ అధికారులు నవీన్, మురహరి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంబంధిత వ్యక్తులపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసుల నమోదుకు సిఫార్సు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

ప్రభుత్వ అధికారిణికి వేధింపులు

- నకిలీ విలేకరి బాగోతం

డోన్: వార్తా సేకరణ అంటూ పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారుల ఫోన్ నంబర్లు సేకరించి అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తున్న నకిలీ విలేకరి భాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డోన్ పట్టణం పాతపేటలోని బీసీ బాలికల మేనేజ్‌మెంట్ హాస్టల్‌కు చెందిన ఒక అధికారిణి ఫోన్ నంబర్‌కు కృష్ణగిరి మండలం కటారుకొండకు చెందిన భాస్కర్ అనే యువకుడు గత కొద్ది రోజులుగా అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టి మానసికంగా వేధిస్తున్నాడు. ఇతని ఆగడాలు, వేధింపులు రోజురోజుకూ అధికం కావడంతో అధికారిణి తన కుటుంబ సభ్యుల సహకారంతో డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఈ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక అధికారి సదరు భాస్కర్ సొంత గ్రామం కావడంతో కేసు నమోదు కాలేదని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు.

కటకటాల్లోకి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్

కర్నూలు (లీగల్): కర్నూలుకు చెందిన (ప్రస్తుతం నంద్యాలలో పనిచేస్తున్న) ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.శోభన్‌బాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జోత్స్నాదేవి గురువారం తీర్పు చెప్పారు. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వర్ నగర్‌లో నివశిస్తున్న ఓ మహిళ 2019 డిసెంబర్ 25న రాత్రి 9:30 గంటల సమయంలో ఇంట్లోని చెత్తను బయట వేసేందుకు వెళ్లగా అదే కాలనీలో ఉంటున్న శోభన్ బాబు అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో భర్త, పొరుగు వారు రాగా నిందితుడు పరారయ్యాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఖాదర్ బాషా వాదించారు.

రెవెన్యూ సిబ్బందికి నెల రోజుల్లో పదోన్నతులు

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూలో పనిచేసే ఉద్యోగులకు నెల రోజుల్లో పదోన్నతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన కలెక్టరేట్‌లో పనిచేసే అన్ని సెక్షన్ల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడం ద్వారా జూనియర్ అసిస్టెంట్లను కారుణ్య నియమకాల ద్వారా సమకూర్చుకోవచ్చన్నారు. సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పిస్తామన్నారు. కలెక్టరేట్ రికార్డు గదిలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రికార్డుల వివరాల ఇండెక్స్ తయారు చేయాలన్నారు. కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వర్మీ యూనిట్ నిర్వహణ మెరుగుపడాలి



వర్మీకంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

పాణ్యం: ప్రతి గ్రామ పంచాయతీని వర్మీ యూనిట్లను మెరుగ్గా నిర్వహించాలని, వాటి ద్వారా ఉత్పత్తయ్యే సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించి ఆదాయం పొందాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం పాణ్యం, బలపనూరు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. వర్మీ యూనిట్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ యూనిట్‌కు తరలించాలన్నారు. చెత్త నుంచి గాజుపెంకులు, ఇనుము ముక్కలు, ప్లాస్టిక్ ఇతర వస్తువులను వేరుచేసి, యంత్రాల సహాయంతో చెత్తను పొడిగా చేయడం ద్వారా సేంద్రియ ఎరువు తయారుచేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు సబ్సిడీ ధరకు అందించాలని సూచించారు. చెత్త సేకరణలో ఎక్కడ జాప్యం జరగరాదని, ప్రతి రోజు సిబ్బంది యంత్రాలు, తోపుడు బండ్లు, రిక్షాల ద్వారా గ్రామంలోని చెత్తను సేకరించాలని ఆదేశరించారు. గ్రామాల శుభ్రతకు పాటుపడాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీటిట్యాంక్‌ల శుభ్రతపై పర్యవేక్షణ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, రాత్రి వేళలో ఫాగింగ్ చేయాలన్నారు. చిత్తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అధికారులను ఆదేశించారు. డీపీఓ మంజువాణి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఈఓఆర్డీ సులోచన, ఎంఈఓ-2 సుబ్రమణ్యం, ఈఓ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అందాల 'పరవళ్లు'



శ్రీశైలం నుంచి సాగార్జున సాగర్‌వైపు కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. గురువారం సాయంత్రం శ్రీశైలం డ్యాం 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 12 అడుగుల వరకు తెరచి 3,08,480 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే నుంచి నీరు దుముకుతూ కనువిందు చేసింది. పొగలా అల్లుకున్న నీటి తుంపరలు డ్యాంకు సరికొత్త అందాలను తెచ్చి పెట్టాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యకాండ

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులు
- ప్రేక్షకపాత్ర పోషించిన పోలీసులు
- కోరం లేక 78 చోట్ల ఎన్నికలు వాయిదా
- 1,378 పాఠశాలకు కొత్త కమిటీలు



నందవరం మండలం కనకవీడు హైస్కూల్‌లో ఉద్రిక్త పరిస్థితి

కర్నూలు(సెంట్రల్): రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల్లో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ సానుభూపతి పరులపై దాడులకు దిగారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం తప్ప ఏమీ చేయలేకపోయారు. టీడీపీకి బలం లేని చోట కోరం లేదంటూ ఎన్నికలను వాయిదా వేయించారు. జిల్లాలో మొత్తం 1,456 ఎస్‌ఎంసీల ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో 1,378 ఎస్‌ఎంసీల ఎన్నికలు జరిగాయి. టీడీపీ నాయకుల దౌర్జన్యం, కోరం లేకపోవడం తదితర కారణాలతో 78 ఎస్‌ఎంసీలకు ఎన్నికలు జరుగలేదు. జిల్లాలో మొత్తం 26 మండలాలకుగాను ఆలూరు, కల్లూరు, కోసిగి, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు మండలాల్లో నూరు శాతం పాఠశాలలకు కొత్త పాలకవర్గాలు వచ్చాయి. మరో 15 మండలాల్లో 90 శాతానికి పైగా పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తయ్యాయి. అత్యంత తక్కువగా చిప్పగిరిలో 57.69 శాతం, హొళగుంద మండలంలో 82.05 శాతం, పెద్దకడబూరులో 79.07 , మంత్రాలయంలో 89.58 శాతం పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి.

టీడీపీ నాయకుల బెదిరింపులు..దాడులు

- కౌతాళం మండలం తొవ్వ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు అత్యధికంగా మద్దతు ఉన్నా టీడీపీ నాయకులు అంగీకరించలేదు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అధికారులు ఎన్నికను వాయిదా వేశారు.
- తుగ్గలి మండలం ముక్కెళ్లలో మద్దతు లేకపోయినా చైర్మన్ తమకే ఇవ్వాలంటూ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను టీడీపీ నాయకులు బెదిరించారు.
- పత్తికొండ పట్టణంలోని ఏపీఆర్‌ఎస్ బాయ్స్ స్కూల్, పత్తికొండ మండలంలోని అటికెలగుండు, పెండేకల్లు ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి.
- మంత్రాలయం మండలం బూదూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేశారు.
- నందవరం మండలం కనకవీడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ నాయకులు ఎన్నికను అడ్డుకున్నారు. తమకు కాకుండా ఇతరులకు మెజారిటీ రావడంతో ఎన్నికను వాయిదా వేయించారు.
- ఆలూరు మండలం కరిడిగుడ్డం ఎంపీపీ స్కూల్, కమ్మరచేడు జడ్పీ హైస్కూల్, మొలగవెల్లి జడ్పీ హైస్కూల్, ఆస్పరి మండలం జొహరాపురం జడ్పీ హైస్కూల్‌లలో టీడీపీ నాయకులు తమ వర్గానికి చెందిన వారినే చైర్మన్‌గా ఎంపిక చేయాలని అధికారులను ఒత్తిడి చేశారు. ఆలూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోనూ ఇదే పరిస్థితి.



మంత్రాలయం మండలం బూదూరులో గాయపడిన ఇంద్ర

- హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కమిటీ చైర్మన్ ఎంపికలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ రౌడీ షీటర్ కురువ రంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరి, దర్గన్న తదితరులతో వాగ్వావాదానికి దిగారు. అయితే వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గిరిపై సీఐ దౌర్జన్యం చేశారు.
- హాలహర్వి , దేవనకొండ, కుంకనూరు, గుండ్లకొండ హైస్కూళ్లలోనూ టీడీపీ నాయకులు దౌర్జన్యం చేశారు.
- మంత్రాలయం మండలం బూదూరులో ఇంద్ర అనే యువకుడిపై టీడీపీ వర్గీయులు చేయి చేసుకున్నారు. ఈ ఘటనతో ఎన్నిక వాయిదా పడింది.
- నందవరం మండలం కనకవీడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో కొందరు టీడీపీ నాయకులు వచ్చి ఎన్నికకు అడ్డుపడ్డారు. ఇక్కడ కోరం ఉన్నా ఎన్నిక వాయిదా పడింది.

నంద్యాల జిల్లాలో..



గోరుకల్లులో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ఎన్నికలు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1,399 పాఠశాలలు ఉండగా.. 1,381 స్కూళ్లలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను ఎన్నుకొని అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించారు. నందికొట్కూరు, పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకున్నారు. సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి లలిత కుమారి అధ్యక్షతన గోరుకల్లులో, నంద్యాల బాలికోన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. నంద్యాల మున్సిపల్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, ఎస్పీజీ, నూనెపల్లె మున్సిపల్ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 18 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

టూరిజం రెస్టారెంట్ల నిర్వహణకు వేలం పాటలు

నంద్యాల(అర్బన్): జిల్లాలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరం ఫుడ్‌కోర్ట్, పగిడ్యాల మండలం ముర్వుమర్రి రెస్టారెంట్ల నిర్వహణకు ఈనెల 16న వేలం పాటలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న రెస్టారెంట్లను లీజుకు ఇచ్చేందుకు వేలం ప్రకటన నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోని పర్యాటక శాఖ బిల్డింగ్‌లో వేలం పాటలు నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు రూ.5 వేలు ధరావత్తును జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా పర్యాటక మండలి వారి పేరిట చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు సెల్ 79950 87089, 82970 98022 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

అందరికీ అందుబాటులో దూరవిద్య

కర్నూలు(సెంట్రల్): రెగ్యులర్‌గా చదువుకునేందుకు ఇబ్బందులున్న వారు దూర విద్యా విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకోవచ్చని ఇన్‌చార్జి జేసీ కె.మధుసూదన్‌రావు తెలిపారు. స్థానిక డీఆర్వో చాంబర్‌లో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ముద్రించిన పోస్టర్లను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లు నిండిన వారు దూర విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. నిర్ణీత రుసుం చెల్లిస్తే ఉచితంగా బోధన చేస్తారని వివరించారు. సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించే పరీక్షలు పాసైన వారు డీజీ లాకర్ ద్వారా సర్టిఫికెట్లను పొందవచ్చని, రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైన వారితో సమానంగా సర్టిఫికెట్లను పరిగణించవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రభూషన్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం కట్టడికి చర్యలు



డోన్ సెబ్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌కుమార్

డోన్ రూరల్: అక్రమ మద్యం, నాటుసారాను అరికట్టాలని అనంతపురం సెబ్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌కుమార్, నంద్యాల జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ సెబ్ సిబ్బందికి సూచించారు. స్థానిక సెబ్ కార్యాలయంను గురువారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటుసారా బట్టీలపై ఉక్కుపాదం మోపాలని, అక్రమంగా మద్యం తరలింపు, విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని సూచించారు. సెబ్ సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ.సోమశేఖర్‌రావు, తదితరులు వెంట ఉన్నారు.

సారా విక్రేత అరెస్ట్

మండల పరిధిలోని చింతపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించి ముమ్మర రమేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 11 బ్రిటిష్ ఎంపైర్ బీర్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే డోన్ టౌన్‌లోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి రూ.25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ.సోమశేఖర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపాలయ్య, సుధాకర్‌రెడ్డి, రమణ, కానిస్టేబుల్ జయచంద్రుడు, ఉమాకాంతరెడ్డి ఉన్నారు.

నిస్సహాయ స్థితిలో పోలీసు వ్యవస్థ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

బొమ్మలసత్రం: కళ్లెదుటే హత్యలు, దాడులు చోటు చేసుకుంటున్నా పోలీసు వ్యవస్థ నిలువరించలేని నిస్సహాయ స్థితిలో ఉందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. నంద్యాలలోని మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కార్యాలయంలో గురువారం ఆయన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పార్టీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బ్రిజేంద్రారెడ్డి (నాని), నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, భూమా కిషోర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక అరాచక పాలన సాగుతోందన్నారు. పోలీసుల సమక్షంలోనే హత్యోదంతాలు, దాడులు చోటు చేసుకుంటున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది మంచిది కాదన్నారు. టీడీపీ నేతలు కనీసం ఈ దాడులను ఖండించకపోవడం చూస్తే వీళ్లే ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందన్నారు. రాయలసీమలో ఎన్నో ఫ్యాక్షన్ నేపథ్యాలను చూశాం కానీ, ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. మహానంది మండలం సీతారామాపురంలో మద్యం మత్తులో శ్రీనివాసరెడ్డి మారణాయుధాలు, అనుచరులతో గ్రామంలో తిరుగుతున్నాడని పోలీసులకు ముందుగా సమాచారం ఇచ్చినా అడ్డుకోలేకపోయారన్నారు. సుబ్బరాయుడును అత్యంత దారుణంగా హత్య చేయడం ఈ ప్రభుత్వ రాక్షస పాలనకు అద్దం పడుతోందన్నారు. ఆళ్లగడ్డలోనూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తను కిడ్నాప్ చేసి దారుణంగా దాడి చేశారన్నారు.

దాడులను నివారించాలని ఎస్పీని కోరాం

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నారా లోకేష్ రెడ్ బుక్ రాజకీయం చేస్తున్నారు. ఇలాంటి హింసాత్మక పాలనను తానెప్పుడూ చూడలేదు. ఈ దాడులను అడ్డుకుని శాంతిభద్రతలను పరిరక్షించాలని జిల్లా ఎస్పీని కోరాం. గడివేములలో ఒండుంట్ల రవి అనే వైఎస్సార్‌సీపీ నాయకున్ని టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతను ప్రస్తుతం చావు బతుకుల్లో కొట్టుమిట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సీతారామాపురానికి వస్తున్నారన్నారు. - రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డిపై 59 కేసులు

సీతారామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డిపై 59 కేసులు ఉన్నాయి. అలాంటి నేరచరిత్ర కలిగిన వ్యక్తి ఇంతటి అరాచకానికి ఒడికట్టడం క్షమించరానిదన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలనలు కొనసాగించారు కానీ ఇలాంటి రెడ్‌బుక్ పాలన ఎప్పుడూ చూడలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక టీడీపీ నేతలు ఇలాంటి దాడులకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. - మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శిశువు లభ్యమైన ఘటనపై విచారణ

శిరివెళ్ల: స్థానిక షాదీఖానా ప్రాంతంలో ఈ నెల 7వ తేదీన చెత్త కుండీలో ఆడ శిశువు లభ్యమైన ఘటనపై జిల్లా అధికారులు గురువారం ఆయా శాఖల సిబ్బందితో విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ పీడీ ఆదేశాలతో.. శిశువు లభ్యమైన 3వ గ్రామ సచివాలయం పరిధిలో మహిళా పోలీస్, అంగన్‌వాడీ వర్కర్ ఇంటింటి సర్వే చేశారు. బుధవారం ఎవరైనా ప్రసవించారా అని ఆరా తీశారు. శిశువుది శిరివెళ్ల అని తేలినట్లు సమాచారం. ఓ మహిళ స్థానికంగా ఓ ప్రైవేట్ హాస్పిటల్లో ప్రసవించి అనంతరం రక్త పరీక్ష కోసం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు వెళ్లినట్లు తెలిసింది. సిబ్బంది రక్త పరీక్ష చేసి రక్తం తక్కువగా ఉందని చెప్పారు. ఆ సమయంలో ఒక వ్యక్తి శిశువును మొఖం కనపడే విధంగా కవర్లో పెట్టి ఎవ్వరూ లేని ప్రదేశంలో వదిలేసి వెళ్లినట్లు చర్చించుకుంటున్నారు. ఇదిలాఉండగా కొందరు పిల్లలు లేని వారు శిశువును పెంచుకుంటామని ఐసీడీఎస్ అధికారుల ఎదుట పోటీ పడ్డారు. నిబంధనల ప్రకారం శిశువును ఇచ్చేందుకు కుదరదని చెప్పి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. అక్కడ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడిచే శిశు గృహానికి చెందిన నర్సు, ఆయా పర్యవేక్షణలో శిశువుకు వైద్య సేవలు అందుతున్నాయి. వైద్యసేవల అనంతరం శిశువును గృహానికి తరలించి పిల్లలు లేని వారికి సీనియార్టీ దరఖాస్తు ప్రకారం దత్తతగా ఇస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందన్నారు.

పోలీసు బైక్‌ను ఢీకొట్టిన ఆటో

- తెగిపడిన ఏఎస్ఐ బాలనాయక్ కుడి కాలు
- తీవ్రంగా గాయపడ్డ పీసీ సర్వేశ్వరరెడ్డి
- విధులకు వెళుతుండగా ప్రమాదం



గాయపడ్డ కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ - మాసుమాన్‌దొడ్డి గ్రామాల మధ్య మలుపు వద్ద గురువారం వేగంగా వచ్చిన ఆటో మోటార్ బైక్‌పై వెళ్తున్న ఏఎస్ఐ బాలనాయక్, కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డిలను ఢీకొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కందనాతిలో కొన్ని నెలల క్రితం జంట హత్యలు జరగగా అప్పటినుంచి గ్రామంలో రూరల్ పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. బందోబస్త్ డ్యూటీ కోసం ఉదయం మోటార్ బైక్‌పై ఏఎస్ఐ బాలనాయక్, కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి వెళ్తున్నారు. మాసుమాన్‌దొడ్డి సమీపంలోని మలుపు వద్ద వెళుతుండగా ఎమ్మిగనూరు వైపు వేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి ఆటోను తప్పించే క్రమంలో ఎడమ వైపునకు తిప్పడంతో వెనక కూర్చున్న ఏఎస్ఐ బాలనాయక్ కుడి కాలుకు ఆటోకు బలంగా తగిలింది. ప్రమాదంలో ఏఎస్ఐ కాలు పూర్తిగా తెగిపోయింది. రక్తపు మడుగులో ఆర్తనాదాలు చేస్తున్న ఏఎస్ఐ, గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఏఎస్ఐ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

హొళగుంద: స్థానిక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకుపోయింది. ఆమె వయస్సు 45 ఏళ్లకు పైగా ఉండొచ్చని తెలుస్తోంది. ఎరుపు చీర, నలుపు రవిక ధరించి ఉంది. సదరు మహిళ కాలువలో పడి రెండు, మూడు రోజులు అయి ఉండొచ్చని శవం ఉబ్బిపోయిందని స్థానికులు తెలిపారు. దిగువ కాలువ కర్ణాటక నుంచి హాలహర్వి, హొళగుంద మండలాల్లో ప్రవేశిస్తుంది. దీంతో కర్ణాటక ప్రాంతానికి చెందిన మహిళ అయి ఉండొచ్చని చర్చించుకుంటున్నారు. ఉదయం బళ్లారి రస్తాలోని బ్రిడ్జి వద్ద స్థానికుల కంటపడిన మృతదేహం కాలువలో ముందుకు కొట్టుకుపోయింది.

కాళ్లు మొక్కుతా.. ఆయాగా కొనసాగించండి

- ఆలూరు ఎంఈఓకు దళిత మహిళ వేడుకోలు



ఆలూరు ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డి కుర్చీ వద్ద కింద కూర్చొని వేడుకుంటున్న దాసరి రంగమ్మ

ఆలూరు: ''సారూ.. మీ కాళ్లు మొక్కుతా.. నాకు ఏ దిక్కూ లేదు.. పాఠశాలలో ఆయాగా కొనసాగించండి'' అంటూ ఆలూరు ఎంఈఓ 2 చిరంజీవి రెడ్డిని ఓ దళిత మహిళ వేడుకున్నారు. ఎంఈఓ కార్యాలయంలో అధికారుల కుర్చీ కింద కూర్చి ఆమె తన ఆవేదనను విన్నవించారు. వివరాలు.. మండలంలోని కమ్మరచేడు గ్రామ ఎంపీపీ పాఠశాలలో ఆదే గ్రామానికి చెందిన దళిత దాసరి రంగమ్మ (వితంతువు) గత పదేళ్ల నుంచి ఆయాగా పనిచేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ఆమెను విధుల నుంచి తప్పించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న దాసరి రంగమ్మ గురువారం ఎంఈఓ కార్యాలయానికి వచ్చారు. భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడని, తనకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారని, కనీసం సెంటు భూమి కూడా లేదని, ఆయాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిపారు. అకారణంగా ఆయా పోస్టు నుంచి తనను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లు మొక్కుతా.. కనికరించాలని ఎంఈఓ 2 చిరంజీవి రెడ్డి కాళ్ల కింద కూర్చొని కన్నీటి పర్యంతమయ్యారు. కార్యాలయానికి వచ్చిన పలువురు ఉపాధ్యాయులు ఈ దృశ్యాన్ని చూసి చలించిపోయారు. ''రంగమ్మా నేను నిన్ను ఆయా పోస్టు నుంచి తొలగించలేదు. గ్రామంలోని పాఠశాల కమిటీ సభ్యులతో తీర్మానం చేయించారు' అని ఎంఈఓ 2 చిరంజీవిరెడ్డి సమాధానం ఇచ్చారు. గ్రామంలో టీడీపీ నేతలు తనను తొలగించి మరొకరిని పనిలో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దళిత మహిళ రంగమ్మ మొరపెట్టుకున్నారు. తన చేతుల్లో ఏమీ లేదని ఎంఈఓ 2 చిరంజీవిరెడ్డి తేల్చి చెప్పడడంతో ఆమె ఆవేదనతో వెళ్లిపోయారు.